బడంగ్‌పేట్ ఎస్‌వోను కలిసిన మాజీ మేయర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పాలకవర్గం పదవీ కాలం ముగిసిన తర్వాత బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డిని మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తమ ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్‌ను ఎంతో అభివృద్ధి చేశామని, ఇక ముందు సైతం అభివృద్ధిని అలాగే కొనసాగించాలని ఈ సందర్భంగా ఆమె ఎస్‌వోను కోరారు. కాగా అందరి సహకారం తో కార్పొరేషన్‌ను ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి ఎస్‌వోను కలిసిన వారిలో ఉన్నారు.



ఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డికి బొకే అందజేస్తున్న పారిజాతారెడ్డి



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌పటేల్

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ సమాజానికి అందించిన సేవలు మరువరానివని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌పటేల్ అన్నారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ కబీర్, మహాత్మా జ్యోతిరావుపూలే ఏవిధంగా అయితే సమాజానికి జ్ఞానజ్యోతిని వెలిగించారో గిరిజనుల అభ్యున్నతికి సంత్ సేవాలాల్ ఎన్నో సేవలుచేసి ఆరాధ్య దైవంగా మారారని కొనియాడారు. ధూమపానం, మద్యపానం, వద్ద జరిగే అనర్థాలపై అప్పట్లోనే సమాజానికి తెలియజేసి చైతన్యపరచిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో లంబాడీల నాయకుడు కిషన్‌నాయక్, డిస్ట్రిక్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

కామినేని చౌరస్తా సుందరీకరణ పనుల పరిశీలన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని కామినేని చౌరస్తా వద్ద చేపడుతున్న వైఎస్సార్ జంక్షన్ సుందరీకరణ పనులను గురువారం మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే వైఎస్సార్ సర్కిల్ పేరుగానే కొనసాగిస్తూ సర్కిల్ విస్తరణను కొంత మేరకు తగ్గించి రూ.60లక్షల వ్యయంతో సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యంజాల జగన్, పారంద సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



స్కాలర్‌షిప్‌లు అందుకుంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

61మంది విద్యార్థినులకు రూ.5లక్షల స్కాలర్‌షిప్‌లు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(న్యూ)కు చెందిన 61మంది విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు చదువుతున్న ఈ కళాశాలకు చెందిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేసి విద్యాపరంగా ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సరైన ధ్రువపత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

వనస్థలిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాలను సరైన ధ్రువపత్రాలు చూపించి తమ వాహనాలను తీసుకెళ్లాలని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు తెలిపారు. గురువారం ఆటోనగర్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు స్టేషన్‌కు తరలించిన 17వాహనాలను సదరు వాహనదారులు సరైన వాహన ధ్రువపత్రాలను పోలీసులకు చూపించి తీసుకెళ్లాలన్నారు. లేనిపక్షంలో ఆ వాహనాలను చట్టప్రకారం బహిరంగ వేలం వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.



జితేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మధుయాష్కీగౌడ్

టీపీసీ సేవాదళ్ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

చంపాపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ జన్మదినంను పురస్కరించుకొని టీసీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని సేవాదళ్ కార్యాలయంలో ఆయనను కలిసి బొకే అందజేసి కేక్‌కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ 43 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలలో పని చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్నట్లు వివరించారు. కేబుల్ ఆపరేటర్ల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వంద కోట్ల నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహారాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాకేష్‌శెట్టి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దుర్గారెడ్డి, వెంకట్‌రెడ్డి, బద్రీనాథ్, కృష్ణ, సురేందర్ పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణకు శుభాకాంక్షలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను గురువారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఎర్ర రవీందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బంగారి శివశంకర్, కుర్రి దేవరాజ్, మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు స్థలాల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు కోసం కృషిచేస్తున్న సంగతి తెలిసిందే. అందుకోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా నగరశివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను గురువారం ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్ కమిషనర్ శశాంక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో కలిసి మండలం పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 224, పసుమాములలోని సర్వే నంబర్ 422లోని ప్రభుత్వ స్థలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ భూములకు చెందిన రికార్డులను పరిశీలించారు. రెండు చోట్లా ఎన్ని ఎకరాల భూమి అందుబాటులో ఉన్నదని తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను కమిషనర్ శశాంకకు వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ జ్యోతి, ఆర్ఐ నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శశాంక తదితరులు

కులగణన రీ సర్వేకు సహకరించండి : రాపోలు జయప్రకాష్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కులగణనకు సహకరించి కులాల అస్తిత్వాన్ని కాపాడాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, భగత్‌సింగ్‌నగర్, జింకలబావికాలనీ, శ్రీనివాసకాలనీ, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక నేతలతో కలిసి ఆయన కులగణన రీసర్వేపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన కులగణనలో వివిధ కారణాలతో పాల్గొనని వారిని కలిసి వివరాలు తీసుకునేందుకు ప్రభుత్వ కులగణన రీసర్వే చేస్తున్నదన్నారు. కులగణన రీ సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బీసీ కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేపడుతున్నదన్నారు. సర్వే జరగని వారు వార్డు కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 04021111111 ద్వారా కూడా వివరాలు తెలుపవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమేష్, హస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు విఠల్, ఖదీర్, సరిత, రజిత, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు చిక్కుళ్ల శివప్రసాద్, మహేందర్‌యాదవ్, వన్నాడి శ్రీనివాస్, ధన్‌రాజ్‌గౌడ్, ఇమ్రాన్‌అలీ, షఫీ, యూనస్, జంగారెడ్డి, అరుణ, సుశీల, సంగీత, గంగం కిషోర్, రంజిత్, మధు, నరేందర్, నయిమ్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ డాక్టర్స్‌కాలనీలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్

అమరుడు యాదయ్యకు ఘన నివాళి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకై జరిగిన మలిదశ ఉద్యమంలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సిరిపురం యాదయ్య వర్ధంతిని గురువారం సరూర్‌నగర్‌లో నిర్వహించారు. అమరుడు సిరిపురం యాదయ్యకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యమకారులు ఘనంగా నివాళులర్పించారు. సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకుని కొత్తపేట చౌరస్తాలోని యాదయ్య విగ్రహం వద్ద పూలమాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో టీపీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పద్మశాలీ సంఘం ఆల్‌ఇండియా యూత్ వింగ్ అధ్యక్షుడు సంఘ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, బీసీ సంఘాల నాయకుడు ఆకుల అరవింద్‌కుమార్, చామకూర రాజు, శ్యాంసుందర్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్‌కుమార్, గాజుల మధు, బెంగరబోయిన సురేష్, చిలుక ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. యాదయ్య ఆత్మార్పణ చేసుకున్న ఉస్మానియా యూనివర్సిటీ గేటు ప్రాంతానికి ఆయన పేరు పెట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.



యాదయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మధుయాష్కీగౌడ్, వజీర్ ప్రకాష్, బేర బాలకిషన్, ఇతర నాయకులు, ఉద్యమకారులు



సిరిపురం యాదయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు

శివాజీ స్ఫూర్తిగా మోదీ పాలన : శ్రీరాములుయాదవ్

● బడంగ్‌పేట్‌లో వైభవంగా శోభాయాత్ర

సరూర్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శివాజీని స్ఫూర్తిగా తీసుకుని ప్రధాని మోదీ దేశంలో సుపరిపాలన అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో భాగంగా బడంగ్‌పేట్‌లో పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, నడికుడ యాదగిరి తదితరులతో కలిసి శివాజీ పల్లకీ మోశారు. అనంతరం శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ హైందవ సామ్రాజ్యం విస్తరణకు, హైందవ జాతి ఐక్యతకు శివాజీ నడుంబిగించారని, ప్రస్తుతం మోదీ పాలన సైతం అదే తరహాలో కొనసాగుతున్నదని అన్నారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

హారతులు పట్టిన ప్రజలు..

బడంగ్‌పేట్‌లో నిర్వహించిన శివాజీ శోభాయాత్రకు స్థానిక ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. తమ ఇళ్ల ముందుకు యాత్ర రాగానే కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. జై భవాని వీర శివాజీ నినాదాలతో యాత్ర హోరెత్తింది. కార్పొరేషన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు.



శివాజీ శోభాయాత్రలో భాగంగా పల్లకీ మోస్తున్న శ్రీరాములుయాదవ్, శంకర్‌రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ విజయపురి, హనుమాన్‌నగర్, గోటేటిఫంక్షన్‌హాల్, సాయినగర్, సమతపురి, వి-గార్డ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ విజయపురి ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, 11కేవీ హనుమాన్‌నగర్, గోటేటిఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, 11కేవీ సమతపురి ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, 11కేవీ వి-గార్డ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత మనందరి బాధ్యతగా గుర్తించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆటోనగర్ టాటా స్ట్రైవ్ టెక్నాలజీస్‌లో సాంకేతిక సిబ్బందికి రోడ్డుభద్రత, ప్రమాదాల నివారణలపై అవగాహన కల్పించారు. తొలుత రహదారి భద్రతపై రూపొందించిన వీడియోలు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతివేగం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అవసరాలకు అనుగుణంగా గమ్యాలను చేరుకునేందుకు వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా నడపడం అత్యంత ప్రమాదకరమని గుర్తించాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపే వారందరూ పాదచారుల భద్రపైన దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ చిల్డ్రన్‌పార్కులో 62మంది మల్కాజిగిరి లిసియం స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ పరిచయం చేశారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. టీటీఐ సిబ్బంది రాచకొండ పరిధిలోని బాలాపూర్, జల్‌పల్లి తదితర 14 ప్రాంతాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు, ప్రజలకూ ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను వివరించారన్నారు. అదేవిధంగా 67 మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో డీడీ కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు.



మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపూడి

చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

● ఐదు సెల్‌ఫోన్లు, ఓ పర్సు, ఆటో స్వాధీనం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని బెదిరించి అతడి వద్ద సెల్‌ఫోన్‌తో పాటు పర్సును దొంగిలించిన ముగ్గురు నిందితులను గురువారం నాగోల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యానాయక్ వివరాల ప్రకారం.. నాగోల్‌లోని అలకాపురి సిగ్నల్ వద్ద బుధవారం రాత్రి రమేష్ అనే వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అంబర్‌పేట్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షానవాజ్, గోకుల్‌నగర్‌కు చెందిన కారు వాషింగ్ సెంటర్‌లో పనిచేసే తలపుల నవీన్, మాడపల్లి స్వప్న అనే ముగ్గురు రమేష్‌ను అడ్డగించి బెదిరించి అతడి వద్ద గల రెడ్‌మీ ఫోన్, పర్సును లాక్కుని పరారయ్యారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా సీసీ ఫుటేజీలను పరిశీలించి గురువారం అంబర్‌పేట్‌లోని వారి నివాసాల వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించగా వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు చోరీకి ఉపయోగించిన ఆటోను, దొంగిలించిన బాధితుడు రమేష్ సెల్‌ఫోన్, పర్సుతో పాటు వారు చోరీ చేసిన మరో నాలుగు ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు.

పుస్తెలతాడు అపహరణకు యత్నం

వనస్థలిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇంటికి నడుచుకుంటు వెళ్తున్న మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణకు యత్నించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీ రోడ్డు నం.8లో డి.దివ్య(29)అఖిల్ దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం మధ్యాహ్నం దివ్య సమీపంలోని నాగార్జునకాలనీలో ఉన్న భవిష్య పాఠశాలలో తన కుతురికి లంచ్ బాక్స్ ఇచ్చి తిరిగి నడుచుకుంటు ఇంటికి వస్తుంది. ఈ సమయంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం (టీఎస్10ఈడబబ్ల్యూ1745)పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో ఉన్న పుస్తెలతాడు అపహరించడానికి యత్నించారు. ఆమె వెంటనే ప్రతిఘటించి, కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పారిపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా దుండగులు వాడిన ద్విచక్రవాహనం గాంధీ ఆస్పత్రిలో చోరీ చేసి, సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఎల్బీనగర్ క్రైం డీసీపీ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు పురుషోత్తంరెడ్డి కుమార్తె వివాహం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని ఓ కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో సహా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డితో పాటు పలువురు హాజరయ్యారు.
- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



పురువీధుల్లో సాగుతున్న ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి పల్లకీ సేవ

ముగిసిన ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో మహిళల నృత్యాలు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాల పీఠ ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అమ్మవారి పల్లకీసేవతో గురువారం ముగిశాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో సాగిన పల్లకీసేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పల్లకీసేవ కోలాట నృత్యాలు, భక్తిసంగీతం, సన్నాయి మేళతాళాలతో మహిళలు నృత్యాలు చేస్తు కనులపండువగా ముందుకు సాగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అసౌకర్యానికి లోనుకాకుండా సహకరించిన భక్తులకు ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సువర్ణలత, అరుణ, హేమ, విజయలక్ష్మి, నీలిమ, రాధ, అర్చన, సురేఖ, సరిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

స్థానిక సంస్థల్లో యాభై శాతం రిజర్వేషన్స్‌కు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం : ధనుంజయనాయుడు

కొత్తపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో యాభై శాతం రిజర్వేషన్స్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం న్యూ నాగోల్ లోని ఎస్‌ఏ డాంగే భవన్‌లో ఆయన ముఖ్య నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కులగణనలో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. బీసీల జనాభాను తక్కువ చేసి చూపినట్లు వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. మార్చి 10న బీసీ మేధావులతో పాటు అఖిలపక్ష నాయకుల బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. కార్యక్రమంలో సమితి నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, బాతరాజు నర్సింహ, లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

మోతీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులు, ఓ యువతిని గురువారం మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. మాదాపూర్ కానామిట్ట సమీపంలోని జీఆర్‌సీ రెసిడెన్స్ భవనం పెంట్ హౌస్‌పై కొందరు గంజాయి తాగుతున్నారని అందిన సమాచారం మేరకు మాదాపూర్ పోలీసులు గురువారం మధ్యాహ్నం సమయంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి తాగుతున్న నలుగురు యువకులు, ఓ యువతని అదుపులోకి తీసుకున్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఏ. వెంకటేష్, పి.విజయ రెడ్డి, ఎం.రాహుల్, ఎస్.శివకుమార్, ప్రియాంక రెడ్డి గంజాయి తాగినట్టు నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ యువకులు నిజామాబాద్ ప్రాంతానికి చెందినవారు కాగా, యువతి మాత్రం హైదరాబాద్ వాసిగా పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుపడ్డ వీరిలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మరోవ్యక్తి ప్రైవేట్ ఉద్యోగి, మిగతా ముగ్గురు ఉద్యోగ అన్వేషణలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యం

హయత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని ఇద్దరి వ్యక్తుల మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట్ పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గురువారం మధ్యాహ్నం సుమారు 50ఏళ్లు ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఒంటిపై లైట్ బ్లూకలర్ లైన్స్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చాదర్‌ఘాట్‌లోని గ్యాస్ స్టేషన్ వద్ద..

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు గురువారం కనుగొన్నారు. చాదర్‌ఘాట్‌లోని గ్యాస్ స్టేషన్ వద్ద వ్యక్తి పడి ఉన్నట్లుగా స్థానికుల సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు హుటాహుటిన చేరుకున్నారు. అనంతరం పరిశీలించగా వ్యక్తి అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియరాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు 40 నుంచి 45 ఏళ్లు కలిగి ఉంటాడని తెలిపారు. మృతుడికి సంబంధించిన కుటుంబీకులు, బంధువులెవరైనా గుర్తించిన వెంటనే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తిరుపతి తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం